



అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

ప్రజలను అప్రమత్తం చేయాలి

- నిత్యావసరాలు, తాగునీరు, ఔషధాలు అందుబాటులో ఉంచాలి
- ఏలేరు వరదపై జిల్లా యంత్రాంగంతో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్

పిఠాపురం, సెప్టెంబరు 4: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, ఎగువ నుంచి వస్తున్న జలప్రవాహంతో ఏలేరు జలాశయానికి వరద ముప్పు పొంచి ఉన్నందున ముంపు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అధికారులకు ఆదేశించారు. మంగళగిరి నుంచి ఆయన జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, ఇతర జిల్లా అధికారులతో బుధవారం ఫోన్‌లో మాట్లాడారు. ఏలేరు రిజర్వాయర్‌లో నీటిమట్టం, అక్కడ ఉన్న పరిస్థితిపై సమీక్షించారు. ఏలేరు రిజర్వాయర్‌కు చేరుతున్న వరదనీరు, సాయంత్రం నుంచి విడుదల చేస్తున్న జలాలు తదితర అంశాల గురించి కలెక్టరు వివరించారు. నాలుగురోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఏలేరు రిజర్వాయర్‌లోనీటిమట్టం 20.13 మీటర్లకు చేరుకుందని, సాయంత్రం 1000 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాలకు సమానంగా పంపుతామని తెలిపారు. దీనిపై పవన్ స్పందిస్తూ పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలు ప్రాంత ప్రజలను, రైతులను అప్రమత్తం చేయాలని సూచించారు. ఇప్పటికే జగనన్న కాలనీ ముంపులో ఉన్నందున అక్కడ వారికి నిత్యావసర సరుకులు అందించాలని ఆదేశించారు. గొల్లప్రోలు పట్టణంలోని కాలనీలు, సూరంపేట, రైల్వేస్టేషన్ ఏరియాతోపాటు సీతానగరం,లక్ష్మీపురం, మల్లవరం, ఏ.విజయనగరం గ్రామాలను అప్రమత్తం చేయాలన్నారు. ముంపు ప్రాంతాల ప్రజలకు అవసరమైన ఆహారం, తాగునీరు, ఔషదాలు పూర్తిస్థాయిలో సిద్ధం చేసుకోవాలని నిర్దేశించారు. రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది రాకూడదని స్పష్టం చేశారు.

ఏలేరు ఉప్పొంగితే.



ఏలేరు వద్ద ఉధృతంగా ఉన్న వరదనీరు

- ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 24.11 టీఎంసీలు
- ప్రస్తుతం 20.13 టీఎంసీల వద్ద నీరు నిల్వ
- 1,000 క్యూసెక్కుల వరద నీరు దిగువకు, 300 క్యూసెక్కులు విశాఖకు విడుదల
- ఎగువన వర్షాలు పడితే ఏలేరు ఉధృతి పెరిగే అవకాశం

ఏలేరు రిజర్వాయరుకు క్రమేపీ వరద ఉధృతి పెరుగుతోంది. ఎగువన విశాఖ ఏజెన్సీ నుంచి వాగులు, వంకల ద్వారా ఇన్‌ఫ్లో ఎక్కువగా వస్తోంది. ఈ రిజర్వాయర్ ద్వారా మెట్టలోని 7మండలాల్లో సుమారు 53వేల ఎకరాలకు సాగు నీరు అందుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 24.11 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 20.13 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా రాత్రి 8గంటల సమయానికి ఎగువ నుంచి ప్రాజెక్టులోకి 2932 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. దీంతో పూర్తిస్థాయి నీటిమట్టం దిశగా వరద వస్తుండడంతో అధికారులు బుధవారం సాయంత్రం దిగువకు 1,000 క్యూసెక్కుల వరద నీరు విడిచిపెట్టారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ అవసరాలకు 300 క్యూసెక్కులు పంపుతున్నారు. ఇప్పుడు రిజర్వాయరు గరిష్ఠ నీటి మట్టానికి చేరుకుంటుండడంతో వచ్చిన వరద నీటిని వచ్చినట్లు కిందకు వదిలేయాల్సిన పరిస్థితి. ఏలేరు ప్రాజెక్టుకు వరద ఇంకా పెరిగితే ఏఏ మండలాల్లో పరిస్థితి ఏంటనే దానిపై ప్రత్యేక కథనం..

కాకినాడ, (ఆంధ్రజ్యోతి)/ఏలేశ్వరం

ఏలేరు రిజర్వాయరు నియమావళి ప్రకారం నీటినిల్వ 23 టీఎంసీలు దాటితేనే వరద నీరు ఎంత ఇన్‌ఫ్లో ఉంటే అంత దిగువకు వదలాలి. దీనివల్ల ప్రతిసారీ నష్టం భారీగా ఉంటోంది. ఈ నేపథ్యంలో కలెక్టర్ షాన్‌మోహన్ చొరవ తీసుకుని కొంత వరద నీటిని ముందునుంచే దిగువకు వదలాలని ఆదేశించారు. వరద ప్రవాహం కాలువలకు పెరుగుతుండడంతో జిల్లాలో ఏలేరు కాలువ వెంబడి ఉన్న ఏలేశ్వరం, ప్రత్తిపాడు, జగ్గంపేట, కిర్లంపూడి, పెద్దాపురం, పిఠాపురం, సామర్లకోట మండలాల పరిధిలో గ్రామాల్లో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అంతకంతకూ వరద నీటిని దిగువకు వదిలితే కాలువల నీరు గ్రామాలను మరింత ముంచేస్తుందని కలవర పడుతున్నారు. పైగా ఇప్పటికే రిజర్వాయరు దాదాపు నిండిపోగా గురువారం నుంచి అల్పపీడనం ప్రభావంతో మూడురోజులపాటు భారీగా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరిక జారీ చేసింది. ఫలితంగా క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి మరింత వరద ప్రాజెక్టుకు పోటెత్తనుంది. అదే జరిగితే వచ్చిన నీటిని వచ్చినట్లు వదిలేస్తే కాలువవెంబడి ఉన్న పరివాహక గ్రామాలు ముంపునకు గురికానున్నాయి. దీనిపై డిప్యూటీ సీఎం పవన్ అధికారులను బుధవారం అప్రమత్తం చేశారు. ఏలేరు ముంపుగ్రామాల్లో ముందస్తు భద్రతాచర్యల్లో భాగంగా తాగునీరు, నిత్యావసరాలు, మందులు సిద్ధం చేయాలని సూచించారు. పంపా, తాండలకు సైతం వరద పెరుగుతోంది.

ఏం చేయాలి

బలహీనంగా ఉన్న గట్లను ముందస్తుగా గుర్తించి పటిష్ఠపరచాలి. తరచూ గండ్లు పడే ప్రాంతాలను గుర్తించి అక్కడ పరిస్థితులను ఇరిగేషన్ అధికారులు స్వయంగా పరిశీలించి మళ్లీ గండ్లు పడకుండా చర్యలు తీసుకోవాలి. రైతులకు అందుబాటులో ఇసుక బస్తాలు, ఇతర అత్యవసర సామాగ్రి ఉంచాలి. ఏలేరు రిజర్వాయర్‌నుంచి నీటిని ఒకేసారి కాకుండా ఇన్‌ఫ్లోస్ ఆధారంగా ఇప్పటినుంచే దశలవారీగా విడుదల చేయాలి. రిజర్వాయర్ నిండే వరకూ మిగులు జలాలు విడుదల చేయకూడదన్న పురాతన పద్ధతికి స్వస్తి పలకాలి.





పొలాల్లో ముంపే

సామర్లకోట, సెప్టెంబరు 4: ఏలేరు ఉధృతి పెరిగితే సామర్లకోట పట్టణంతోపాటు మండలంలోని ఐదు గ్రామాలకు సంబంధించి వరిపంట నీటమునుగుతోంది. ఏలేరు గేట్లు ఎత్తితే సామర్లకోట పట్టణ శివారు పిఠాపురం రోడ్డులో 500ఎకరాలు, మండలంలోని నవర, రావువారి చంద్రంపాలెం, పవర, పండ్రవాడ, గొంచాల గ్రామాల్లోని 600 ఎకరాల వరిపంట నీటి ముంపులో ఉండాల్సిన పరిస్థితి ఉంటుంది. ఏలేరు ధాటికి పంటలకు తోడు సామర్లకోట పట్టణ శివారు ప్రభుత్వ టిడ్కో గృహాలకు కూడా ముంపు సమస్య తప్పడంలేదు. పెద్దాపురం మండలం మీదుగా సామర్లకోటకు పంట కాలువ ద్వారా ఏలేరు నీరు వస్తోంది. సామర్లకోట స్లూయిజ్‌లనుంచి నేరుగా వెస్ట్ ఏలేరు కాలువలోకి పూర్తిగా మళ్లిస్తేనే శాశ్వత ప్రాతిపదికన ముంపు సమస్య తీరుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

ప్రత్తిపాడు, సెప్టెంబరు 4: ప్రత్తిపాడు మండలం ఏలూరు గ్రామానికి చెందిన వెయ్యి ఎకరాల పంట పొలాలు ఏలేరు ఆయకట్టు పరిధిలోని ఉన్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఏలేరు నీటి విడుదల కారణంగా ఇవి ముంపులోనే ఉన్నాయి.

భయం గుప్పిట్లో రైతులు

పెద్దాపురం, సెప్టెంబరు 4: పెద్దాపురం మండల పరిధిలోని ఏలేరు కాలువ 13 కిలోమీటర్ల మేర ఉంది. 10,500 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఏలేరు జలాశయం నుంచి నీటి విడుదల నేపథ్యంలో రైతులు తమ పంటలు ఎక్కడ మునిగిపోతాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాండ్రకోట, కట్టమూరు, పాతపెద్దాపురం, వడ్లమూరు మీదుగా సామర్లకోట వరకూ ఏలేరు కాలువ ఉంది. పంట కాలువ ఉలిమేశ్వరం, దివిలి మీదుగా వెళ్తోంది. 4వేల క్యూసెక్కుల పైబడి నీరు విడుదలైతే పంటలు మునిగే ప్రమాదం ఉందని అధికారులు చెబుతున్నారు. కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఏలేరు రిజర్వాయర్ నుంచి వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేశారని ఎవరూ కూడా ఆందోళన చెందాల్సిన పనిలేదని ఆర్డీవో సీతారామారావు తెలిపారు.



ఏలేరు గేట్లు ఎత్తివేత కారణంగా సామర్లకోటలో నీటమునిగిన వరిపొలాలు, టిడ్కో గృహాల ఫ్లాట్లు(ఫైల్)



గతంలో ఏలేరుకు సంభవించిన భారీ వరదలతో ఏలేరు కాలువకు గొల్లప్రోలువద్ద పడిన గండి(ఫైల్)

బలహీనంగా గట్లు

- శిథిలమైన రెగ్యులేటర్
- ఏలేరుకు వరద వస్తే ప్రమాదమే
- వరద అత్యవసర సామాగ్రి నిల్



పిఠాపురం-గొల్లప్రోలు మధ్య ఏలేరు కాలువపై పిడింధొడ్డి రెగ్యులేటర్ దుస్థితి ఇది

పిఠాపురం/గొల్లప్రోలు, సెప్టెంబరు 4: ఏలేరు ఆధునికీకరణ పేరుతో రెండు దశాబ్దాలుగా కాలువల నిర్వహణకు గాలికి వదిలివేశారు. పడిన గండ్లను తాత్కాలిక ప్రాతిపదికన పూడ్చారు. గట్లు కోతకు గురవుతున్నా నివారణ చర్యలు లేక బలహీనంగా మారాయి. అధికంగా వరద వస్తే పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో నష్టం అధికంగా ఉండే అవకాశం ఉంది. వరద అత్యవసర సామాగ్రి కూడా సిద్ధంగా లేదు.

ఏలేరు రిజర్వాయర్ ద్వారా వచ్చే నీటితో పిఠాపురం, గొల్లప్రోలు మండలాల్లో 23వేల ఎకరాలు సాగవుతున్నాయి. వరద వస్తే ఏలేరు ఆయకట్టుతోపాటు పీబీసీ ఆయకట్టు ముంపునకు గురవుతోంది. పిఠాపురం నియోజకవర్గంలో 40వేల ఎకరాల్లో పంటకు నష్టం జరుగుతుంది. రిజర్వాయర్ నుంచి 10వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తే గొల్లప్రోలు పట్టణంలోని మార్కండేయపురం, గాంధీనగర్, రాయవరం రోడ్డు తదితర ప్రాంతాలు, అంతకంటే అధికంగా విడుదల చేస్తే పట్టణంలో అధిక భాగం ముంపు బారిన పడే అవకాశం ఉంది. ఆ ప్రభావం చేబ్రోలు, మల్లవరం, సీతానగరం లక్ష్మీపురం, చెందుర్తి గ్రామాల పరిధిలోని పంటపొలాలపై ఉంటుంది. పిఠాపురం మండలంలో మాధవపురం, నవఖండ్రవాడ ముంపునకు గురవుతాయి. మండలంలో 18 గ్రామాల పరిధిలోని పంటపొలాలకు ముంపు పొంచి ఉంటుంది. రిజర్వాయర్ నిర్మాణం తర్వాత వరద నీరు వెళ్లేలా కాలువల నిర్మాణం జరగకపోవడం శాపంగా మారింది.

రెగ్యులేటర్లు, కళింగల్స్ శిథిలం

ఏలేరు కాలువల గట్లు కోతకు గురికాగా, సాగునీటి ప్రవాహాన్ని నియంత్రించే కళింగల్స్, రెగ్యులేటర్లు శిథిలమయ్యాయి. 2019లో ఏలేరుకు సంభవించిన భారీ వరదల కారణంగా పిఠాపురం నియోజకవర్గంలోని గొర్రిఖండి, నక్కలఖండి, పెదయేరు, పీబీసీ సహా 16 కాలువల పరిధిలో 40కిపైగా గండ్లు పడ్డాయి. వీటిని ఇసుకబస్తాలతో తాత్కాలిక ప్రాతిపదికన పూడ్చి వదిలివేశారు. గండిపడిన సమయాల్లో దాన్ని పూడ్చడంతోపాటు అక్కడ రివిట్‌మెంట్ చేస్తారు. ఇలా చేయకపోవడంతో తరచూ గండ్లు పడుతున్నాయి. రెగ్యులర్ లస్కర్లు లేకపోవడంతో కాలువల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. వరదలు వస్తే గట్లను పటిష్ఠపరచడానికి, గండ్లు పడకుండా చూసేందుకు సంచులు, ఇసుక, ఇతర సామాగ్రి ఎక్కడాలేదు. వరద అత్యవసర సామాగ్రిని కూడా ఇరిగేషన్‌శాఖ విస్మరించింది.

భారీవర్షాల నేపథ్యంలో..

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

- ఏ సమస్య ఎదురైనా టోల్‌ఫ్రీ నెంబర్ 1800 4253077 లేదా అధికారుల నెంబర్లకు ఫోన్ చేయండి: కలెక్టర్

కాకినాడ సిటీ, సెప్టెంబరు 4: జిల్లాలో భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కాకినాడ కలెక్టరేట్‌లో 24 గంటలు అందుబాటులో ఉండేలా 18004253077 టోల్‌ఫ్రీ నెంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఏదైనా సమస్య తలెత్తితే వెంటనే ఈ నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు. 24గంటలూ సిబ్బంది అందుబాటులో ఉంటారని, ఈనెల 7 వరకు సిబ్బందికి విధులు కేటాయించామని తెలిపారు. వర్షాల వల్ల ఏ ఇబ్బంది ఏర్పడినా, రోడ్లు తెగినా, చెట్లు కూలినా, ట్రాఫిక్ ఆగినా టోల్‌ఫ్రీ నెంబర్ లేదా కంట్రోల్ రూమ్ సిబ్బంది నెంబర్లకుగానీ ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. ఆర్డీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాల్లోను కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు.

కంట్రోల్ రూమ్‌లో అధికారుల ఫోన్ నెంబర్లు

5వ తేదీ.. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సీనియర్ అసిస్టెంట్ దుర్గాభవాని(ఫోన్ నెంబర్ 91772 17896), మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటల వరకు సీనియర్ అసిస్టెంట్ భవాని(ఫోన్ నెంబర్ 95052 71155), రాత్రి 8 గంటల నుంచి మర్నాడు ఉదయం 7 గంటల వరకు జూనియర్ అసిస్టెంట్ సాయి నరేంద్ర (ఫోన్ నెంబర్ 79976 72438)

6వ తేదీ.. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సీనియర్ అసిస్టెంట్ సాయి దీపిక(ఫోన్ నెంబర్ 79976 72438), మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 8 గంటల వరకు సీనియర్ అసిస్టెంట్ సుధా మాధురి (ఫోన్ నెంబర్ 95020 17997), రాత్రి 8 నుంచి మర్నాడు ఉదయం 7 గంటల వరకు జూనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్ (ఫోన్ నెంబర్ 81848 38068)

7వ తేదీ.. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సీనియర్ అసిస్టెంట్ బోయాస్ (ఫోన్ నెంబర్ 95503 68149), మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు వీఆర్వో సత్తిబాబు (ఫోన్ నెంబర్ 80087 52520), రాత్రి 8 గంటల నుంచి మర్నాడు ఉదయం 7 గంటల వరకు వీఆర్వో సుశీల్‌కుమార్ (ఫోన్ నెంబర్ 85220 86785)

మళ్లీ వానలు



తుని మండలం గరవ కోనేరు వద్ద జాతీయ రహదారిపై కురుస్తున్న వర్షం

- విరామం లేకుండా భారీ వర్షాలు
- జిల్లాలో ఏలేరు, పంపా, తాండవ ప్రాజెక్టులకు వరద
- నేటి నుంచి మళ్లీ అల్పపీడనం: జిల్లాకు ఎల్లో అలెర్ట్ జారీ
- జిల్లాలో ఈనెల 7 వరకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

జిల్లాను భారీ వర్షాలు వీడడం లేదు. విరామం లేకుండా కొన్నిరోజులుగా ఎడతెరిపి లేకుండా పెద్దఎత్తున వానలు పడుతున్నాయి. ఎగువనుంచీ భారీగా నీరు వస్తుండడంతో జిల్లాలో రిజర్వాయర్లకు భారీగా వరద పోటెత్తుతోంది. అల్పపీడనం ప్రభావంతో రాబోయే మూడురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ఏలేరుకు వరద ముప్పు మరింత పెరిగే ప్రమాదం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో కాలువ వెంబడి ఏడు మండలాల్లో ముంపునకు గురయ్యే గ్రామాల ప్రజలు, రైతులు బిక్కుబిక్కుమంటున్నారు. గురువారం నుంచి బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుండడంతో జిల్లాకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. భారీవర్షాలు కురుస్తాయని హెచ్చరించింది. దీంతో కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం ఏర్పాటు చేశారు. ఒకపక్క భారీ వర్షాలు, వరదతో జిల్లాలో వరి, వాణిజ్య పంటలు వేలాది ఎకరాల్లో ముంపునకు గురవుతున్నాయి. ప్రాథమికంగా వరి 21వేల ఎకరాలు, పత్తి, ఇతర వాణిజ్య పంటలు 450ఎకరాల్లో దెబ్బ తిన్నాయి. జిల్లాలో బుధవారం అత్యధికంగా తాళ్లరేవులో 3.6సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

జిల్లాకు ఎల్లో అలెర్ట్...

ఒకపక్క వర్షాలు, వరదలతో జిల్లా కోలుకుండా ఉంటే మళ్లీ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. దీని ప్రభావంతో గురువారం నుంచి జిల్లాలో భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని వాతావరణశాఖ హెచ్చరిక జారీ చేసింది. ఈ మేరకు జిల్లాకు ఎల్లో అలెర్ట్ ప్రకటించింది. ఈ నేపథ్యంలో కాకినాడ కలెక్టరేట్‌లో అత్యవసరంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. ఈనెల 7వరకు నిరంతరం కంట్రోల్‌రూం అందుబాటు లో ఉంటుందని అధికారులు ప్రకటించారు. తీరప్రాంతంలో భారీ వర్షాలు, ఈదురుగాలులు వీస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. జిల్లాలో బుధవారం అనేకచోట్ల భారీగా వర్షం కురిసింది. అత్యధికంగా తాళ్లరేవులో 3.6 సెంటీమీటర్లు, రౌతులపూడి, యు.కొత్తపల్లి 3, గొల్లప్రోలు 2, శంఖవరం 1.9, పెదపూడి 1.6 సెంటీ మీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. ఒకపక్క వర్షాలకు జిల్లాలో పెద్దఎత్తున పంటలు నీటమునిగాయి. ఇప్పుడు మళ్లీ అల్పపీడనం హెచ్చరికలతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. నీటమునిగిన పంట ఇప్పటికే నీరు లాగక కుళ్లిపోయే పరిస్థితి తలెత్తడంతో విలపిస్తున్నారు. మళ్లీ వర్షాలు వస్తే ఉన్న పంట కూడా నష్టపోతుందని బెంబేలెత్తుతున్నారు. కాగా తాజా వర్షాలకు జిల్లాలో వరి పంట నష్టం 21వేల ఎకరాల వరకు ఉంటుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. త్వరలో నష్టం అంచనాలకు సిద్ధమవుతోంది. పత్తి 250ఎకరాలు, కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల తోటలు 300 ఎకరాల్లో నీటమునిగినట్లు ఉద్యానవనశాఖ అంచనా వేసింది.

సుద్దగడ్డతో ముప్పే..

గొల్లప్రోలు, సెప్టెంబరు 4: అధిక వర్షాలు కురిస్తే చాలు సుద్దగడ్డ పొంగుతుంది. ఈ ఏడాదిలో 40 రోజుల వ్యవధిలో సుద్దగడ్డకు రెండుసార్లు వరదలు సంభవించాయి. గత మూడు దశాబ్దాల కాలంలో వంద సార్లకు పైగా సుద్దగడ్డకు వరదలు వచ్చి గొల్లప్రోలు పట్టణంతోపాటు మండలంలోని గ్రామాలకు అపారనష్టం వాటిల్లింది. గొల్లప్రోలు పట్టణంలోని ఈబీసీ కాలనీ, దేవినగర్, కంకరరేవడ్లు, శివాలయమాన్యం, ఎస్సీ కాలనీ, అరుంధతీయపేట, సూరంపేట తదితర ప్రాంతాల్లో 3,500 గృహాలు ముంపులో చిక్కుకునే అవకాశం ఉంది. జగనన్న కాలనీకి వెళ్లే రహదారిపై ఆరు అడుగులకు పైగా ఎత్తులో నీరు ప్రవహించే అవకాశం ఉంది. ఇప్పటికే అక్కడ వరద నీరు ప్రవహిస్తోంది. ఐదు రోజులుగా సుద్దగడ్డ వరద ముంపులో పంటపొలాలు చిక్కుకున్నాయి.



సుద్దగడ్డకు ఇటీవల వచ్చిన వరదల కారణంగా ముంపునకు గురైన పంటపొలాలు

నేడు గురుపూజోత్సవం

- జేఎన్టీయూకే అలూమ్నీ ఆడిటోరియంలో నిర్వహణ: డీఈవో

కాకినాడ రూరల్, సెప్టెంబరు 4: జిల్లాలో మండల, డివిజన్, జిల్లాస్థాయిల్లో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన ఉపాధ్యాయులకు గురుపూజోత్సవ సన్మాన కార్యక్రమాన్ని గురువారం కాకినాడ జేఎన్టీయూకేలోని అలూమ్నీ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు డీఈవో పి.రమేష్ తెలిపారు. మొత్తం 70 మంది వివిధ కేటగిరీలకు చెందిన ఉపాధ్యాయులను సత్కరించనున్నామన్నారు. ఈ కార్యక్రమం ఉదయం 8గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు.

గ్యాస్ తవ్వకాల భద్రతపై 47వ ప్రాంతీయ కాంటింజెన్సీ కమిటీ సమీక్ష

కాకినాడ, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ సమీపంలోని తూర్పు తీరంలో గ్యాస్, చమురు తవ్వకాలకు సంబంధించి భద్రత చర్యలు మరింత పకడ్బందీగా ఏ విధంగా చేపట్టాలనే దానిపై 47వ ప్రాంతీయ కాంటింజన్సీ కమిటీ బుధవారం చర్చించింది. కాకినాడలోని ఓ ప్రైవేట్ హోటల్లో తూర్పు నావికాదళ చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో నేవీ, షిప్పింగ్, కస్టమ్స్, వైమానిక దళ, పోలీసు విభాగాలతోపాటు వివిధ చమురు, గ్యాస్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. కేజీ బేసిన్‌లో పలు కంపెనీలు ఆఫ్ షోర్ ప్లాట్ ఫారాల ద్వారా గ్యాస్, చమురు తవ్వకాలు చేపడుతున్న నేపథ్యంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఎలాంటి భద్రత చర్యలు చేపట్టాలి.. అత్యవసర పరిస్థితుల్లో ఎలా వ్యవహరించాలి అనే కీలక అంశాలపై లోతుగా సమీక్షించారు.



సమీక్ష నిర్వహిస్తున్న ప్రాంతీయ కాంటింజెన్సీ కమిటీ

జీజీహెచ్‌లో పలు విభాగాలను పరిశీలించిన కలెక్టర్

జీజీహెచ్(కాకినాడ), సెప్టెంబరు 4: కాకినాడ జీజీహెచ్‌ను కలెక్టర్ షాన్‌మోహన్ బుధవారం సందర్శించి పలు విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కోస్టల్ ఆక్వా ప్రైవేటు లిమిటెడ్ సమకూర్చిన గంటకు 3వేల లీటర్ల సామర్థ్యం కలిగిన నాలుగు ఆర్వోప్లాంట్లను, చెవి, ముక్కు, గొంతు ఓపీల్లో ఏర్పాటు చేసిన 2ఆడియో మీటర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రికి వచ్చే రోగుల సహాయకులు మంచినీటికి ఇబ్బందులు పడేవారని, ఇప్పుడు ఆ సమస్య తీరిందన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.లావణ్యకుమారి, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ కోనాల అనిత, కోస్టల్ ఆక్వా ప్రైవేటు లిమిటెడ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఆర్వోప్లాంట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్



గురువు... పోలీస్

- శ్రీకాకుళం జిల్లాలో టీచర్‌గా కెరీర్ ప్రారంభం
- ప్రస్తుతం 'తూర్పు గోదావరి జిల్లా ఎస్పీగా విధులు
- సమాజానికి మరింత సేవ చేయాలని సివిల్స్‌కి
- గురుపూజోత్సవం సందర్భంగా

'ఆంధ్రజ్యోతి'తో నరసింహ కిషోర్ మాటామంతీ

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)



బ్లాక్ బోర్డు, చాక్‌పీస్‌తో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించి తర్వాత పట్టుదలతో ఉన్నత స్థాయికి చేరిన వాళ్లు చాలా మంది ఉన్నారు. ఇంటర్వ్యూ వరకు వెళ్లి వెనక్కి వచ్చేశామని, కోచింగ్ లేదని ఇలా రకరకాల కారణాలకు తలొగ్గకుండా విజయం సాధించారు. పరిశ్రమ, లక్ష్య సాధనే వారిని అంతటి వారిని చేస్తోంది. అలా ఉపాధ్యాయుడిగా కెరీర్‌లో అడుగుపెట్టి నేడు తూర్పు గోదావరి జిల్లా పోలీసులకు బాస్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు దూసి నరసింహ కిషోర్. జిల్లాకు వచ్చిన కొద్ది రోజుల్లోనే అటు ప్రజల్లో... ఇటు సిబ్బందిలో మంచి పేరు సంపాదించుకున్న ఆయన గురువారం గురు పూజోత్సవం సందర్భంగా పలు విషయాలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

ఆంధ్రజ్యోతి: మీ విద్యాభ్యాసం ఎక్కడ సాగింది?

ఎస్పీ: ఒకటి నుంచి ఏడో తరగతి వరకు ఒడిశా బోర్డురులోని మఠం సరియాపల్లి అనే మారుమూల పాఠశాలలో జరిగింది. ఎస్ఎం పురంలో 10 వరకు చదివాను. డిగ్రీ శ్రీకాకుళంలో పూర్తి చేశాను.

అధ్యాపక వృత్తిని ఎంచుకోవడం?

1993లో డిగ్రీ పూర్తయింది. తర్వాత బీఎస్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ, పీవో... ఇలా రకరకాల పోటీ పరీక్షలు రాశాను. ఏడుసార్లు ఇంటర్వ్యూ వరకూ వెళ్లినా ఫలితం లేకపోయింది. ఈ క్రమంలో 1995లో బీఈడీ పూర్తిచేసి 1996లో ఉపాధ్యాయ పోటీ పరీక్షలో విజయం సాధించాను. శ్రీకాకుళం జిల్లా పాత కొంకాం అనే మారుమూల పల్లెలో తొలి పోస్టింగ్.

యూనిఫాం సర్వీసు వైపు రావడానికి కారణం?

మా నాన్న గారు ధర్మారావు టీచర్. ఆయనకు మంచి రచయితగా, పెద్ద మనిషిగా పేరుంది. మాది శ్రీకాకుళం అయినా రోజూ ఆయనతోనే స్కూలుకు వెళ్లి రావడం జరిగేది. పదో తరగతి వరకు అలా ట్రావెల్ చేశాను. సోషల్ వర్కర్ కూడా. చదువు, సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేసేవారు. ఆయన ప్రభావం నాపై ఎక్కువగా ఉండేది. దీంతో సివిల్స్‌కి వెళితే సమాజానికి మరింత మేలు చేయవచ్చనే ఆలోచన కలిగింది. మా ఇల్లే ఓ లైబ్రరీ. అందువల్ల వేరే కోచింగ్ తీసుకోలేదు. 2003లో గ్రూప్-1 రాశాను. 2006లో నర్సీపట్నంలో డీఎస్పీగా తొలి పోస్టింగ్. 2017లో నాన్-క్యాడర్ ఎస్పీ తర్వాత.. 2022లో ఐపీఎస్ వచ్చింది.

బోధనలో అప్పటికీ ఇప్పటికీ తేడా ఏమిటి?

విద్యార్థులు చాలా అప్‌డేట్ అయ్యారు. దానిని టీచర్లు అందుకోవాల్సిన అవసరం ఉంది. అప్పటి పిల్లలు టీచర్ చెప్పిందే లోకం అనుకునేవారు. కానీ మారిన పరిస్థితుల్లో ప్రశ్నించే స్థాయికి చేరుకున్నారు. దానిని మనం స్వాగతించాలి. వారితో స్నేహపూర్వకంగా మెలగాలి. ఇప్పటి పిల్లలపై సోషల్ మీడియా, సెల్‌ఫోన్ వంటి వాటి ప్రభావం ఎక్కువగా ఉంది. విద్యార్థికి కావాల్సింది క్లాస్‌రూంలో దొరకట్లేదని అనిపిస్తోంది. నైపుణ్యం అవసరమే అయినా సృజనాత్మకత వైపు విద్యార్థులను ప్రోత్సహించాలి.

విద్యార్థి వృద్ధిలో టీచర్, తల్లిదండ్రుల పాత్ర చెప్తారా?

విద్యార్థి నడవడిక (క్యారెక్టర్), పద్ధతి వంటివి ఇంటి నుంచే మొదలవ్వాలి. విద్యార్థి వద్ద పాఠశాలను, టీచర్లను చులకనగా మాట్లాడడం చేయకూడదు. విద్యార్థి ఎలాంటి సమస్యలనైనా తట్టుకునే విధంగా టీచర్ ధైర్యం నింపాలి. సృజనాత్మకతను వెలికితీసి పదునుపెట్టాలి. ప్రతి విద్యార్థిలోనూ ప్రత్యేకమైన ప్రతిభ ఉంటుంది. దానిని ఒడిసి పట్టుకుని సానబట్టాలి.

టీచర్ నుంచి దండన దూరం కావడం మంచిదేనా?

అప్పుడైనా ఇప్పుడైనా విద్యార్థులను కొట్టడం సరికాదు. వారి మనసులో ఒకటి ఉంటుంది. మనం ఒకటి చెబుతూ ఉంటాం. అక్కడే ఘర్షణ ప్రారంభమవుతుంది. పిల్లల తల్లిదండ్రులతో కూడా టీచర్లు మాట్లాడుతూ ఉండాలి. అప్పుడు ఈయన తప్పని పరిస్థితుల్లో ఒక దెబ్బ వేసినా తల్లిదండ్రులు అర్థం చేసుకుంటారు. టీచర్‌కి, విద్యార్థికి మధ్య శత్రుత్వం ఉండదు కదా. ఓ విద్యార్థికి, ఉపాధ్యాయుడికి ఉన్న బంధం ఎన్నటికీ కొనసాగుతూనే ఉంటుంది.

టీచర్లకు, సమాజానికి మీరిచ్చే సందేశం?

మానవ అవతారంలో ఉన్న దేవుడు రాముడికి జ్ఞానబోధ చేసిన అగస్త్యుడిని ఆది గురువుగా చెప్తుంటారు. తర్వాత శ్రీకృష్ణుడు జగద్గురువుగా వినుతికెక్కాడు. చెడు మార్గంపైపు వెళ్లకుండా జీవితాన్ని పసితనం నుంచే ఉన్నతం వైపు చేయిపట్టి నడిపించేవాడే గురువు. అలాంటి గురువుకి సమాజం తగిన గౌరవం ఇవ్వాలి. పిల్లాడి వృద్ధిపై తప్ప వేరే విధంగా వ్యక్తిగత కక్షలు టీచర్లకి ఎందుకుంటాయి?. ప్రతి విద్యార్థీ వృద్ధి చెంది, మంచి పేరు తెచ్చుకోవాలనే తాపత్రయం ప్రతి టీచర్‌లోనూ ఉంటుంది. దీనిని అర్థం చేసుకోవాలి. సమాజంలో అంతర్లీనంగా అతి ఎక్కువగా కలిసిపోయే ఉద్యోగం టీచర్, పోస్ట్‌మ్యాన్ మాత్రమే.

టీచర్, పోలీస్.. ఏది సంతృప్తినిచ్చింది?

టీచర్, పోలీస్.. రెండూ సమాజ సేవకు అంకితమయ్యేవే. దేనికదే ప్రాధాన్యం కలిగిన వృత్తి. ఇప్పటికీ నేను పని చేసిన స్కూల్స్‌కి వెళ్తుంటాను. ఆ ఊళ్లలో వారు మన మాస్టారు వచ్చార్రా.. అంటూ ఆప్యాయంగా పలకరిస్తారు. ఒకప్పటి నా విద్యార్థులు ఇప్పుడు ఇంజనీర్లుగా, డాక్టర్లుగా ఉన్నారు. పోలీస్‌గా కూడా ఎంతో మంది బాధితులకు న్యాయం చేశాను. ఇంకా చేయాల్సింది చాలా ఉంది. ఈ రోజు అయిపోయింది. రేపు కొత్తగా ఎలాంటి అహంభావాలు, భేషజాలు లేకుండా సమాజానికి మేలు చేస్తూ గడిచిపోవాలి.

థాంక్యూ... మళ్లీ కాసేపు పాత రోజులకు తీసుకెళ్లారు. మనసుకు ఏదో తెలియని హాయినిచ్చింది అంటూ ముగించారు



ఉపాధ్యాయ సహచరులతో ఆత్మీయ కలయికలో ఎస్పీ నరసింహ కిషోర్ (పాత చిత్రం)

గురువే దైవం

భగవంతుడు ఆగ్రహిస్తే గురువును ఆశ్రయించి అనుగ్రహాన్ని పొందవచ్చు. అదే గురువు ఆగ్రహిస్తే అనుగ్రహించే భగవంతుడే ఉండడని శాస్త్ర వచనం. అందుకే గురువు ఎక్కువా.. భగవంతుడు ఎక్కువా.. అనే మీమాంస వచ్చినప్పుడు గురువే ఎక్కువని చెప్తారు. ఎందుకో తెలుసా.. భగవంతుడిని చూడాలనే జ్ఞానాన్ని నేర్పించేది గురువే కనుక. గురువు అనుగ్రహం లేకుండా ఎవరూ జీవిత లక్ష్యాలను సాధించలేరు. తల్లి, తండ్రి, గురువు, అతిథి... ఈ నలుగురూ ప్రత్యక్ష గురువులు.

అమలాపురం రూరల్, సెప్టెంబరు 4: అక్షరానికి అంకురారోహణ చేసే తరగతి గది ఒక అద్భుత ప్రయోగశాల. సమాజాన్ని నిర్మించడంలో, నైతిక విలువలు కాపాడడంలో ఉపాధ్యాయుడి పాత్ర కీలకం. ప్రపంచంలో నానాటికీ పెరిగిపోతున్న పోటీతత్వంవల్లో, ఆధునిక పోకడల గ్రహింపు కొరవడడంవల్లో, ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు పెరిగిపోవడంవల్లో గురువులు తమపై ఉన్న బాధ్యతను ఒకింత పక్కన పెట్టి విద్యార్థులను బట్టీ పట్టే మరమనుషులుగా తయారు చేస్తున్నారు. చదువులను యాంత్రిక ప్రక్రియగా మార్చేస్తున్నారు. పుస్తకాల్లోని పాఠాలు చెప్పడంతోనే ఉపాధ్యాయుల బాధ్యత తీరిపోదని గ్రహించాలి. సమాజం పట్ల బాధ్యత కలిగిన విద్యావంతులను ఆధునిక గురుబ్రహ్మలు తయారుచేయాలి. సామాజిక అవగాహన లేని చదువు ప్రయోజకత్వాన్ని చేకూర్చదు. విజ్ఞానంతో పాటు సమస్యల పరిష్కారం, సమాజం పట్ల బాధ్యత పెంచేలా చదువులు ఉండాలి. ఏ చదువైనా పిల్లలకు మానసికంగా ఎదగడం నేర్పాలి. చదివిన కొద్దీ జ్ఞానం పెరుగుతుంది. ఒకప్పటి గురుకులాలు నేటి సంక్షేమ వసతిగృహాలు వంటివే. గతంలో అన్ని వర్గాల పిల్లలకు ఒకే తరహా పాఠశాలల్లో నాణ్యమైన విద్యను గురువులు బోధించేవారు. పిల్లల బాగోగులను తల్లిదండ్రుల కన్నా గొప్పగా బడిలో ఉపాధ్యాయులే చూస్తారనడంలో ఎంతమాత్రం అతిశయోక్తి లేదు. నవసమాజ నిర్మాతలను తయారు చేయగల శక్తి ఉపాధ్యాయులకు మాత్రమే ఉంది. గురువును మించిన పూజనీయుడు, ఉద్ధారకుడు ఎక్కడా కనిపించడు. ప్రతి వ్యక్తికీ పూజనీయులుగా తల్లి, తండ్రి, గురువు, దైవం నిలుస్తారు. అయితే ఒక్క గురువులోనే ఈ నాలుగు అంశలు మనకు కనిపిస్తాయి. గురువు కన్నతల్లిలా లాలించి బుజ్జగిస్తాడు. కన్నతండ్రిలా మంచిచెడ్డలు గమనిస్తూ అభివృద్ధికి పాటుపడతాడు. దేవుడిలా ఆశీర్వదిస్తూ దిశానిర్దేశం చేస్తుంటాడు. శిష్యుడిలోని అజ్ఞానాంధకారాన్ని తొలగిస్తాడు. ఈ నాలుగు పాత్రలు పోషిస్తున్న గురువు ప్రతి వ్యక్తికీ నిజమైన ఆత్మబంధువు.



అమలాపురం రూరల్ పాలగుమ్మి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయుడు పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్ వాటర్ కలర్స్ ఉపయోగించి గీసిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రం



వరద బాధితులకు రూ.కోటి విరాళం

కృష్ణా జిల్లా వరద బాధితులకు ఆపన్నహస్తం అందించేందుకు ముందుకొచ్చారు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిదకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, బీఎస్ఆర్ ఇన్‌ఫ్రా అధినేత బలుసు శ్రీనివాసరావు. బుధవారం ఆయన అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని కలిసి రూ.కోటి విరాళం చెక్కు అందజేశారు.

- మండపేట

రాష్ట్రపతి నుంచి అవార్డు అందుకోవడం మరువలేను

మోటూరి భైరవస్వామి

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత



రాష్ట్రపతి నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకునే వారు కొందరే. అటువంటి వారిలో నాకూ చోటు లభించడం ఎన్నటికీ మర్చిపోలేను. 1985-86 సంవత్సరంలో అప్పటి రాష్ట్రపతి జ్ఞానీ జైల్‌సింగ్ నుంచి జాతీయ అవార్డు అందుకున్నాను. అంతకు ముందు వరుసగా మూడేళ్ల రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నాను. ఢిల్లీలో రాష్ట్రపతి భవన్‌లో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులందరినీ ప్రత్యేక అతిథులుగా గుర్తించిన తీరు నేటికీ మరిచిపోను. రాష్ట్రపతి భవన్‌లో 132 గదులు ఉంటే మూడు మినహా అన్నిటినీ చూపించారు. రాష్ట్రపతితో కలిసి విందు భోజనం చేయడం ఎంతో అదృష్టం. ఆనాడు అసలు సిసలు సిల్వర్ మెడల్‌తో పాటు రూ.2,500 నగదు పారితోషికం, ప్రశంసాపత్రం అందించారు.

నైతిక విలువలు పెంపొందించాలి

కేకేవీ నాయుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు



అప్పటికీ, ఇప్పటికీ ఉపాధ్యాయుల విద్యా బోధనలో ఎన్నో మార్పులొచ్చాయి. ఆ రోజుల్లో నైతిక విలువలు బోధించేందుకు ప్రత్యేక పీరియడ్లు ఉండేవి. ఇప్పుడా పరిస్థితి లేదు. నైతిక విలువలు పెంపొందించకపోవడం వల్లే సమాజంలో నేడు కనిపిస్తున్న అశాంతికి కారణమవుతోంది. తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించే సంప్రదాయం పాఠశాల తరగతి గదుల నుంచే ప్రారంభం కావాలి.

నిత్య విద్యార్థిగా మెలిగితేనే సత్ఫలితాలు

మంగళంపల్లి అరుణ్‌కుమార్, ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్



ఉపాధ్యాయులు ఎప్పటికీ నిత్య విద్యార్థులుగానే ఉండాలి. అప్పుడే విద్యోన్నతిలో భాగంగా ఎప్పటికప్పుడు మార్పులకు అనుగుణంగా విద్యా బోధన సాగించగలుగుతారు. తరగతి గదుల్లో పాఠ్యాంశాలకు మాత్రమే పరిమితం కాకుండా సమాజం పట్ల బాధ్యత, నిబద్ధత పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉంది. సమాజంలో గురువుల పట్ల గౌరవం ఏమాత్రం సడలలేదు.



ప్రత్యేక అలంకరణలో శ్రీపాదశ్రీవల్లభుడు, దత్తాత్రేయస్వామి, నృసింహ సరస్వతి

శ్రీపాద శ్రీవల్లభులకు సహస్ర లిల్లీ పుష్ప పూజ

పిఠాపురం, సెప్టెంబరు 4: కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో జరుగుతున్న శ్రీపాద జయంతి సప్తాహ మహోత్సవాలు బుధవారం నాలుగో రోజుకు చేరుకున్నాయి. శ్రీపాద శ్రీవల్లభులకు సహస్ర లిల్లీ పుష్పాల పూజ నిర్వహించారు. శ్రీపాద శ్రీవల్లభుని పాదపద్మములకు మహన్యాసపూర్వక శతరుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుషసూక్తాలతో సహస్ర నామార్చన, రుత్విక్కులతో మూల మంత్ర అనుష్ఠానం జరిగాయి. సాయంత్రం పల్లకి సేవ జరిగింది. కార్యనిర్వహణాధికారి సౌజన్య, భక్తులు పాల్గొన్నారు.



వేలి గోటిపై 'సర్వేపల్లి' చిత్రం

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం నరసాపురపుపేట జడ్పీ ఉన్నత పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయుడు రాయుడు త్రినాథ్ ప్రసాద్ బొటన వేలి గోటిపై సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రం వేశాడు. ఒకటిన్నర సెంటీమీటర్లో మైక్రో ఆర్ట్ ద్వారా దీనిని తీర్చిదిద్దాడు. - ద్రాక్షారామ

సగ్గు బియ్యం, గోధుమలతో రాధాకృష్ణన్ చిత్రపటం

ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని తూర్పు గోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన విద్యార్థి కుంచాల తపస్విరెడ్డి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాన్ని వినూత్నంగా రూపొందించాడు. అర కిలో సగ్గు బియ్యం, పావు కిలో గోధుమలతో మూడు గంటల పాటు శ్రమించి రాధాకృష్ణన్ చిత్రపటాన్ని తీర్చిదిద్దాడు. దీనిని తిలకించిన ఉపాధ్యాయులు, పట్టణ ప్రముఖులు తపస్విరెడ్డిని అభినందించారు.

- నిడదవోలు



ధర్మవరం వద్ద మోటారు సైకిళ్లు ఢీ

క్షతగాత్రులను ప్రొటోకాల్ వాహనంలో ఆసుపత్రికి తరలించిన కలెక్టర్ షన్ మోహన్

చికిత్స పొందుతూ ఆర్ఎంపీ వైద్యుడి మృతి, మరో వ్యక్తికి తీవ్ర గాయాలు







1. ముసలారావును కలెక్టర్ కారులో తరలిస్తున్న దృశ్యం 2. ప్రత్తిపాడు ఆసుపత్రిలోకి తీసుకెళ్తూ 3. విగతజీవిగా...

ప్రత్తిపాడు, సెప్టెంబరు 4: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం వినాయకుని గుడి కూడలి వద్ద బుధవారం రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న ఘటనలో ఆర్ఎంపీ వైద్యుడు మృతి చెందగా మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రులను కలెక్టర్ షన్ మోహన్ తన ప్రొటోకాల్ కారులో ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించారు. గొల్లప్రోలు మండలం చెందుర్తికి చెందిన ఆర్ఎంపీ సిద్దాంతపు ముసలారావు సలారావు (52) మోటారు సైకిలుపై ప్రత్తిపాడు మండలం ధర్మవరం బయల్దేరి వెళ్లాడు. అదే గ్రామం నుంచి గొల్లప్రోలుకు చెందిన పొన్నాడ హరిగంగాధర్ స్నేహితుడు బాబీతో కలిసి రాజానగరం బయల్దేరాడు. ముందుగా వన్నెపూడి నుంచి ధర్మవరం వైపు వస్తున్న ముసలారావు ధర్మవరం వినాయకుడి గుడి కూడలి వద్ద మలుపు తిరుగుతుండగా వెనుక నుంచి వేగంగా వస్తున్న హరిగంగాధర్, బాబి మోటారు సైకిలు ఢీకొంది. ముసలారావు, హరిగంగాధర్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో ఏలేశ్వరంలో ఏలేరు రిజర్వాయరును పరిశీలించి కాకినాడ వెళ్తున్న కలెక్టర్ షన్ మోహన్ తన ప్రొటోకాల్ వాహనాన్ని ఆపి అందులో క్షతగాత్రులిద్దరినీ ఎక్కించి ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ముసలారావు మృతి చెందాడు. ఆర్ఎంపీ కుటుంబీకులు ఆసుపత్రి వద్ద కన్నీరుమున్నీరయ్యారు. తమ కుటుంబానికి దిక్కెవరు అంటూ ముసలారావు ముగ్గురు కుమార్తెల రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి. ప్రత్తిపాడు తహసీల్దారు సూర్యప్రభ ఆసుపత్రికి వచ్చి మృతుడి కుమార్తెలను పరామర్శించి ఓదార్చారు. సంఘటనాస్థలాన్ని సీఐ బి.సూర్యఅప్పారావు, ఎస్ఐ ఎం.పవన్‌కుమార్ పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



ముసలారావు (పాత చిత్రం)



సంఘటనా స్థలంలో నవీన్ మృతదేహం

ఆగి ఉన్న లారీని ఢీకొని యువకుడి మృతి

గండేపల్లి, సెప్టెంబరు 4: కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలో జెడ్.రాగంపేట గ్రామ శివారులోని పెట్రోలు బంకు ఎదురుగా రాజమహేంద్రవరం నుంచి తుని వైపు వెళ్లే మార్గం ట్యాంకరు ఆగి ఉంది. వెనుక నుంచి బైక్‌పై వెళ్తున్న కరణం నవీన్ అలియాస్ సిద్దు (22) బలంగా ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. సిద్దు సొంతూరు అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం కరణం కొత్తూరు. బుధవారం అతడు విజయవాడ నుంచి స్వగ్రామానికి వెళ్లే క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. విషయం తెలుసుకున్న హైవే మొబైల్ సిబ్బంది పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ శివనాగబాబు వచ్చారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

గౌతమి, గరీబ్‌రథ్ రైళ్లు రద్దు



రాయనపాడు వద్ద ముంపులో ట్రాక్

సామర్లకోట, సెప్టెంబరు 4: భారీ వర్షాల కారణంగా సామర్లకోట మీదుగా విశాఖ, విజయవాడలకు రాకపోకలు సాగించే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు మూడో రోజైన బుధవారం కూడా రద్దయ్యాయి. ఈ కారణంగా ప్రయాణికులు లేక సామర్లకోట రైల్వే స్టేషన్ నిర్మానుష్యంగా మారింది. బుధవారం రద్దయిన వాటిలో కాకినాడ నుంచి లింగంపల్లి వెళ్లే గౌతమి ఎక్స్‌ప్రెస్, గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్, హౌరా నుంచి చెన్నై వెళ్లే ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-విశాఖ మధ్య నడిచే 2740 నంబరు గల ఎక్స్‌ప్రెస్, విశాఖ-సికింద్రాబాద్ మధ్య నడిచే 12739 నంబరు గల ఎక్స్‌ప్రెస్ ఉన్నాయి. హైదరాబాద్-విశాఖ (12728), మహబూబ్‌నగర్-విశాఖ (12862), ఎల్టీటీ-విశాఖ (18520)... ఈ మూడింటినీ పగిడిపల్లి, గుంటూరు, విజయవాడ మీదుగా మళ్లించినట్టు సామర్లకోట రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ ఎం.రమేష్ తెలిపారు. విజయవాడ సమీపాన రాయనపాడు వద్ద రైల్వే ట్రాక్ బుధవారం సాయంత్రానికి కూడా నీటి ముంపులో ఉన్నందున ఈ మార్పులు కొనసాగిస్తున్నట్టు రైల్వే అధికారులు చెప్పారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

లోవ దేవస్థానం మాస్టర్ ప్లాన్‌పై సమీక్ష

తుని రూరల్, సెప్టెంబరు 4: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానానికి నూతన మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు ఇంజనీరింగ్ అధికారులు దేవస్థానంలో పర్యటించారు. భక్తులకు అనుగుణంగా భవిష్యత్ ప్రణాళికలను రూపొందించారు. సమీక్షలో ఇండియా 'హెరిటేజ్' ప్రాజెక్టు హైదరాబాద్‌కు చెందిన ప్రతినిధులు ఇంజనీరింగ్ అధికారులు దుర్గేష్‌కుమార్, కార్యనిర్వాహక ఇంజనీర్ శ్రీనివాసాచార్యులు, ఆలయ ఈవో విశ్వనాథరాజు ఉన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, టీడీపీ, జనసేన నాయకులు

'పొలం పిలుస్తోంది' పోస్టర్ ఆవిష్కరణ

జగ్గంపేట, సెప్టెంబరు 4: స్థానిక రావులమ్మనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో పొలం పిలుస్తోంది కార్యక్రమ పోస్టర్‌ను జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ ఆవిష్కరించారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలనే ఉద్దేశ్యంతో రైతులకు అన్ని రకాల సహాయ సహకారాలు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వారు తెలిపారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూతో ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ భేటీ అయ్యి రాజకీయ అంశాలపై చర్చించుకుని జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తానని ఎంపీ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్‌వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, జాస్తి వసంత్, దాపర్తి సీతారామయ్య జనసేన నాయకులు ఉలిసి ఐరజ్, పాలిశెట్టి సతీష్, మరిసే రామకృష్ణ, మొగిలి గంగాధర్, సింగూలూరి రాందీప్, దొడ్డ శ్రీను, తాళ్ళూరు రామిరెడ్డి పాల్గొన్నారు.

'పిల్లలందరినీ సొంత బిడ్డలుగా చూసుకోవాలి'

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 4: పిల్లలందరినీ తమ సొంత బిడ్డలుగా చూసుకోవాలని, విధులు మొక్కుబడిగా కాకుండా మనస్ఫూర్తిగా నిర్వహించాలని డీఆర్‌వో తిప్పే నాయక్ సూచించారు. కలెక్టర్ కార్యాలయంలోని గౌతమి సమావేశ మందిరంలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన పోషకాహార మాసోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులందరూ మనస్ఫూర్తిగా పనిచేయాలన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ పీడీ కె.ప్రవీణ మాట్లాడుతూ సెప్టెంబరు 1 నుంచి 30 వరకు పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమాలు వివిధ శాఖల సమన్వయంతో ప్రతి పాఠశాలలో నిర్వహిస్తామన్నారు. గర్భిణులు 15మందికి సీమంతాలు, ముగ్గురు పిల్లలకు అన్నప్రాసనలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి, డిప్యూటీ డైరెక్టర్ హార్టీకల్చర్ మల్లికార్జునరావు, సమాచారశాఖ డీడీ డి.నాగార్జున, డీఐవో శ్రీనివాసనాయక్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ స్వర్ణలలిత, ఎస్‌సీపీసీఆర్ మెంబర్ ఆదిలక్ష్మి, విద్యాశాఖ ఏడీ శ్రీరామ్ పాల్గొన్నారు.

మెరుగైన రీతిలో బోధించాలి : సీఎంవో

తొండంగి, సెప్టెంబరు 4: విద్యార్థులకు మెరుగైన రీతిలో వారికి అనువైన విధంగా బోధన సాగిస్తూ శారీరక మానసిక ఎదుగుదలకు కృషి చేయాలని ఐఈఆర్టీ జిల్లా కోఆర్డినేటర్, సీఎంవో చామంతి నాగేశ్వరరావు సూచించారు. స్థానిక భవిత కేంద్రాన్ని ఆయన బుధవారం పరిశీలించి పిల్లల అభ్యసనా స్థాయిపై పలు సూచనలు చేశారు. రికార్డులు తనిఖీ చేశారరు. దివ్యాంగులైన పిల్లలంతా భవిత కేంద్రం లేదా పాఠశాలల్లో ఉండాలని, ఏ ఒక్కరూ బయట ఉండకూడదన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వపరంగా అందుతున్న సదుపాయాలపై తల్లిదండ్రులకు వివరించాలన్నారు. ఐఈఆర్టీ ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, జగన్నాథం తదితరులు ఉన్నారు. అనంతరం ఆయన మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈవోలు షేక్‌బాబ్జి, సుబ్బిరెడ్డిలతో సమావేశమయ్యారు.

బాలికలు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలి : సీఐ

పెద్దాపురం, సెప్టెంబరు 4: సమాజంలో తమని తాము కాపాడుకునేందుకు, ఆత్మరక్షణ కోసం బాలికలు మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలని పెద్దాపురం సీఐ టి.క్రాంతికుమార్ సూచించారు. బుధవారం స్థానిక మహారాణీ కళాశాలలో ఆత్మరక్షణ కర్తవ్యం అనే అంశంపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడుతూ ఏదైనా సమస్య వచ్చినప్పుడు భయపడకుండా ప్రశ్నించడం నేర్చుకోవాలని, బాలికలందరూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. చదువులో కూడా రాణించాలని, ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, వేధించినా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వి.మౌనిక పాల్గొన్నారు.

తూరంగిలో పీడీఎస్ బియ్యం సీజ్

కాకినాడ రూరల్, సెప్టెంబరు 4: రూరల్ మండలం తూరంగిలో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.2,94,552 విలువ గల పీడీఎస్ బియ్యాన్ని బుధవారం విజిలెన్స్, రెవెన్యూ సివిల్ సప్లయిస్ అధికారులు సీజ్ చేశారు. పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలకు సంబంధించిన సమాచారం మేరకు అధికారులు తూరంగిలోని గండి నరేష్ షెడ్డును తనిఖీ చేయగా 3012 కిలోల పీడీఎస్ బియ్యం, ఏపీ05టీఎమ్ 4816 నెంబరు గల ఆటో, ఒక తూకం యంత్రాన్ని గుర్తించారు. అనపర్తికి చెందిన కోనాల ఆనందరెడ్డి సూచనల మేరకు కనకాల దుర్గారావు ఈపీడీఎస్ బియ్యాన్ని కాకినాడ ప్రాంతానికి చెందిన కార్డుదారుల నుంచి కొనుగోలు చేసి యానాం, కాజులూరు ప్రాంతాలకు చెందిన ఇటుక బట్టీ కార్మికులకు అమ్ముతున్నట్టు ఆటో యజమాని, డ్రైవర్ పాల రామప్రసాద్ తెలిపారన్నారు. బియ్యాన్ని నిల్వ ఉంచిన వ్యక్తులపై 6ఏ కేసు నమోదు చేసి క్రిమినల్ కేసుల నమోదు కోసం ఇంద్రపాలెం పోలీసులకు అప్పగించామని డీటీ మమత తెలిపారు.

కోడిపందేలు ఆడుతున్న పదిమంది అరెస్ట్

జగ్గంపేట, సెప్టెంబరు 4: జగ్గంపేట మండలంలోని నరేంద్రపట్నం, మామిడాడ గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలో రహస్యంగా నిర్వహిస్తున్న కోడిపందేలపై బుధవారం తెల్లవారుజామున దాడులు నిర్వహించామని జగ్గంపేట ఎస్ఐ రఘునాధరావు తెలిపారు. జగ్గంపేట పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కోడిపందేలు ఆడుతున్న 10మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.78వేలు నగదు, 2 కోడి పుంజులు, 2కోడికత్తులను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

జగ్గంపేట మండలం మల్లిశాలలో పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురు పేకాటరాయులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.7వేలు స్వాధీనం చేసుకున్నామని కేసు నమోదు చేశామని జగ్గంపేట ఎస్ఐ రఘునాధరావు పేర్కొన్నారు.

'ఆదిత్య'లో ఉన్నత విద్యావకాశాలపై సదస్సు

గండేపల్లి, సెప్టెంబరు 4: సూరంపాలెంలో ఆదిత్య యూనివర్శిటీ నందు హైయర్ స్టడీస్ ఆపొర్చునిటీస్ ఇన్ జర్మనీ అనే అంశంపై సదస్సు జరిగిందని డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. డాక్టర్ పి.సందీప్ పాటిల్ గ్రూప్ లీడర్ ఆర్‌డబ్ల్యుటీహెచ్ అచెన్ యూనివర్శిటీ పాల్గొని జర్మనీలో ఉన్నత విద్యావకాశాల ప్రాముఖ్యతపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఆదిత్య ప్రో చాన్సలర్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి, డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్‌చాన్సలర్ డాక్టర్ ఎంబి శ్రీనివాస్, ప్రో వైస్‌చాన్సలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, డీన్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ డాక్టర్ పిఎస్ రంజిత్ పాల్గొన్నారు. అనంతరం డాక్టర్ సందీప్‌ను సత్కరించారు.

గణిత బోధనకు మెంటర్‌గా సాయి రామకృష్ణ

సామర్లకోట, సెప్టెంబరు 4: కేంద్రప్రభుత్వ సంస్థ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ ఎన్‌సీటీఈ గణిత బోధనకు జాతీయ మెంటర్‌గా సామర్లకోట అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోటకూర సాయి రామకృష్ణను ఎంపిక చేస్తూ కన్వీనర్ అభిమన్యు నుంచి ఉత్తర్వులందాయి. దీంతో సాయి రామకృష్ణను సామర్లకోట ఎంఈవోలు, పలువురు విద్యాధికారులు అభినందించారు.

ఉరివేసుకుని మహిళ ఆత్మహత్య

జగ్గంపేట, సెప్టెంబరు 4: జగ్గంపేటకు చెందిన ముద్దాడ జ్యోతి (29) బుధవారం మధ్యాహ్నం 1గంట సమయంలో ఇంట్లో ఉరేసుకుని మృతి చెందినట్టు ఆమె బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ నూకరాజు వెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. జ్యోతి మృతికి ఆమె భర్త దుర్గాప్రసాద్ కారణమైనట్టు మృతురాలి బంధువులు అనుమానం వ్యక్తం చేశారు. జ్యోతి, దుర్గాప్రసాద్‌లకు వివాహమై 9 ఏళ్ల కాగా వారికి ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. ఏఎస్ఐ నూకరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలను అప్రమత్తం చేయాలి

జిల్లాలో పలుచోట్ల పర్యటించిన కలెక్టర్

ఏలేశ్వరం, సెప్టెంబరు 4: ఏలేరు ఆధారిక ప్రాంతంలో ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. ఏలేశ్వరంలోని ఏలేరు రిజర్వాయర్‌ను బుధవారం కలెక్టర్ సందర్శించారు. ఎగువ ప్రాంతం నుంచి పెద్దమొత్తంలో నీరు చేరుకోవడంతో అధికారులను అప్రమత్తం చేశారు. ప్రాజెక్టులోని వివిధ గ్యాప్‌లను పరిశీలించి ప్రస్తుత నీటి నిల్వలను అడిగి తెలుసుకున్నారు. భారీవర్షాలు కురుస్తాయనే వార్తల నేపథ్యంలో ముందస్తు చర్యలు, జాగ్రత్తలను తీసుకోవాలని స్థానిక అధికారులకు ఆదేశించారు. ఎప్పటికప్పుడు వరద నీటిపై అంచనా ఉండాలని అందుకు అణుగుణంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ, నీటి పారుదల, పోలీసుశాఖలు సమన్వయంతో పని చేసి ఏలేరు వరదలతో ఎవరికీ ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టంచేశారు. కార్యక్రమంలో ఆర్డీవో జె.సీతారామారావు, తహశీల్దార్ ఆర్ వి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు: ఏలేరు రిజర్వాయర్ నుంచి అదనపు జలాలు విడుదల చేస్తే వచ్చే వరదలపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ ఆదేశించారు. ఆయన బుధవారం గొల్లప్రోలులో విస్తృతంగా పర్యటించారు. ఇప్పటికే సుద్దగడ్డ వరద ముంపులో ఉన్న సూరంపేట ప్రాంతాన్ని, అసంపూర్తిగా ఉన్న ఊబంద బ్రిడ్జిని, ఏలేరు, పీబీసీ కాలువలను, రైల్వేస్టేషన్ వద్ద ఉన్న పంటపొలాలను పరిశీలించారు. వరద వస్తే ఉత్పన్నమయ్యే పరిస్థితులను ముందుగానే అంచనా వేసి అందుకు తగ్గట్టుగా సిద్ధంగా ఉండాలని, అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. సూరంపేటకు పీబీసీకాలువపై నుంచి వెళ్లే మార్గంలో ఉన్న ఊబంద బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని, తాను నిధులు ఇస్తానని కలెక్టరు తెలిపారు. జగనన్నకాలనీ వద్ద బ్రిడ్జి నిర్మాణానికి వరద తగ్గగానే చర్యలు చేపడతామని తెలిపారు. ముంపునకు గురయ్యే ప్రాంతాల్లో ఉండే గర్భిణులు, దీర్ఘకాలిక రోగాలతో బాధపడుతున్న వారిని ఆసుపత్రికి


ఏలేరు రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

తరలించాలని సూచించారు. 2వేల ఆహార ప్యాకెట్లను పంపిణీకి సిద్ధం చేయాలని చెప్పారు. ఆయన వెంట కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్, తహశీల్దార్ సత్యనారాయణ, ఇరిగేషన్ ఈఈ శేషగిరిరావు, ఏఈ శ్రీనివాస్, పద్మజ, డిప్యూటీ తహశీల్దార్ ఇస్మాయిల్, సివిల్‌సప్లైస్ డీటీ మర్రి వీరాస్వామి, ఫిషరీస్ అధికారులు రామకృష్ణ, ఉమామహేశ్వరరావు ఉన్నారు.

తాళ్లరేవు: వరదల పట్ల ప్రభుత్వాధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. పిల్లంక పంచాయతీ శివారు కొత్తలంక గ్రామంలో పరిస్థితులను ఆయన పరిశీలించారు. వైద్యశిబిరాలు, పారిశుధ్యం, పునరావాస కేంద్రాలు ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎమ్.సూరిబాబు, ఎంపీడీవో ఎమ్.అనుపమ పాల్గొన్నారు.

అధికారుల పర్యటన

సామర్లకోట, సెప్టెంబరు 4: మండలంలో పలు గ్రామాల్లో భారీవర్షాల కారణంగా ఖరీఫ్ వరి పొలాలు పలు గ్రామాల్లో ముంపు బెడదను ఎదుర్కొంటున్నందున ప్రస్తుత తరుణంలో పంటలను కాపాడుకునే విధంగా మెళకువలు పాటించాలని కాకినాడ ఏడీఏ రత్నప్రశాంతి, సామర్లకోట ఎంఏవో ఐ.సత్యలు పిలుపునిచ్చారు. మండలంలో ఉండూరు, బ్రహ్మానందపురం, గొంచాల, అచ్చంపేట గ్రామాలు, సామర్లకోట పట్టణ పరిధిలో పలు ప్రాంతాలను వారు పరిశీలించి రైతులకు పలు సూచనలిచ్చారు. సామర్లకోట-పిఠాపురం రోడ్లో ఏలేరు కాలవ నీటి ప్రవాహాన్ని సామర్లకోట తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. ఏలేరు స్లూయిజ్ వద్ద, టిడ్కో ప్లాట్‌ల వద్ద వీఆర్వోలతో రక్షణ ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ కె.శ్రీనివాస్, వీఆర్వో నలజర్ల మురళీకృష్ణ, నూతలపాటి లోవరాజు,రాంజీ ఉన్నారు.

పెద్దాపురం: మండల పరిధిలోని ఏలేరు పరివాహక ప్రాంతాలైన కట్టమూరు, మర్లావ, కాండ్రకోట, వడ్లమూరు, పాతపెద్దాపురం తదితర ప్రాంతాలను తహశీల్దార్ సీహెచ్.వెంకటలక్ష్మీ పరిశీలించారు. రైతులు, ప్రజలతో మాట్లాడి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి అవగాహన కల్పించారు. గ్రామాల్లో వీఆర్వోలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఇరిగేషన్ ఏఈ పాలెపు వీరబాబు పాల్గొన్నారు.

తుని రూరల్: తిమ్మాపురం, గవరపేట, హెచ్‌కొత్తూరు, హంసవరం గ్రామాల్లో వ్యవసాయ శాఖాధికారి బుల్లిబాబు, అశోక్‌కుమార్‌లు పర్యటించి రైతులకు సస్య రక్షణ చర్యలపై అవగాహన కల్పించారు.

కిర్లంపూడి: ఏలేరు ప్రాజెక్టు పరిధి మండలంలోని ఎస్.తిమ్మాపురం, గెద్దనాపల్లి, రామకృష్ణాపురం, రాజుపాలెం, ముక్కొల్లు గ్రామాల్లోని ఏలేరు కాలువలను పెద్దాపురం ఆర్డీవో జె.సీతారామరావు, కిర్లంపూడి తహశీల్దార్ చిరంజీవి పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. ఆయా ప్రాంతాల్లో రైతులకు నీటి ప్రవాహం వల్ల ఏర్పడే ప్రభావాలను వివరించారు. అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ముక్కొల్లులో ఎస్సీపేట, మేస్త్రీకాలనీ, కొత్తకాలనీల్లో వరద ప్రభావిత ప్రాంతాన్ని ఆర్డీవో సందర్శించారు.

'320 హెక్టార్లలో పంట నష్టం'

పిఠాపురం రూరల్, సెప్టెంబరు 4: అధికవర్షాలు, వరదల కారణంగా పిఠాపురం మండలంలో 320 హెక్టార్లల్లో పంటకు నష్టం వాటిల్లినట్టు వ్యవసాయాధికారులు తెలిపారు. పిఠాపురం మండలం పి.దొంతమూరు, వెల్దుర్తి, పి.రాయవరం, పి.తిమ్మాపురం గ్రామాల్లో ముంపునకు గురైన పొలాలను వారు పరిశీలించారు. ముంపు తగ్గగానే తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి రైతులకు వివరించారు. పరిశీలనలో వ్యవసాయశాఖ ఏడీ పి.స్వాతి, మండల వ్యవసాయాధికారి అచ్చుతరావు తదితరులు పాల్గొన్నారు.


వెంకటరమణ, శ్యామలాకుమారి, వెంకటేశ్వరరావు
(కరప) (ప్రత్తిపాడు) (తొండంగి)

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక

కరప, సెప్టెంబరు 4: మండలంలోని ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఐదుగురు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్టు ఎంఈవోలు కొప్పుల బులికృష్ణవేణి, పత్తి సత్యనారాయణ తెలిపారు. స్థానిక మండల విద్యావనరుల కేంద్రంలో బుధవారం వారు మాట్లాడుతూ నడకుదురు నెంబర్-1 ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం వాకాడ వెంకటరమణ, యండమూరు ఎంపీయూపీ పాఠశాలకు చెందిన బొక్కా పద్మావతి, కరప, గొర్రిపూడి హైస్కూళ్లకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు చీపురుపల్లి కృష్ణ, వై.సువర్చలాదేవి, కరప మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కేవీ రామకృష్ణారావులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఐదుగురిని అధికారులు, సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

రౌతులపూడి: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా స్థానిక హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు కోళ్ళ రాంబాబు పాటు ఎస్.నరసింహమూర్తి, వై.రాజు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్టు ఎంఈవో కొండబాబు తెలిపారు. వారు ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా కలెక్టర్ నుంచి బహుమతులు అందుకుంటారని చెప్పారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అభినందనలు తెలియజేశారు.

పెద్దాపురం: మండల పరిధిలో ఎస్.సూర్య శ్రీనివాసరావు (చదలాడ), దువ్వూరి అన్నపూర్ణ (ఆర్‌బీ పట్నం), రత్నకుమారి (విటికర్ పాఠశాల), జి.గంగాధర్ (ఉలిమేశ్వరం) జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు ఎంఈవో ప్రభాకరశర్మ ఓ ప్రకటనలో తెలిపారు.

కాకినాడ రూరల్: పండూరులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడు ముమ్మిడి వీరవెంకట సత్యనారాయణ జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ప్రధానోపాధ్యాయిని సూర్యప్రకాశిని, ఉపాధ్యాయులు అభినందించారు.

సామర్లకోట: సామర్లకోట గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.దేవప్రసాద్, వేట్లపాలెం ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయుడు కెబీఆర్. బలరామ్‌చౌదరి, ఉండూరు పాఠశాల నుంచి ఆర్వీరమణమూర్తి, కాపవరం పాఠశాల నుంచి ఏ. వెంకన్నబాబు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారని ఎంఈవోలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య తెలిపారు.

ప్రత్తిపాడు: మండలంలో ఏలూరు ఎంపీపీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని అనపర్తి శ్యామలాకుమారి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికయ్యారని మండల విద్యాశాఖాధికారి పి.రాజబాబు తెలిపారు.

తొండంగి: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఏ.కొత్తపల్లి ప్రాథమిక పాఠశాల పిఎస్‌హెచ్‌ఎం నూతలపాటి వెంకటేశ్వరరావు, కెజీబీవి ఉపాధ్యాయిని పూర్ణిమ కూడా అవార్డుకు ఎంపికయ్యారు. వారిని ఎంఈవోలు షేక్ బాబ్జి, అనిశెట్టి సుబ్బిరెడ్డి, టీచర్లు అభినందించారు.

గండేపల్లి: మండలంలోని మురారి నంబర్ 3 పాఠశాలలో సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయురాలు శ్యామలకుమారి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎన్నికయ్యారు. ఎంఈవోలు కెహెచ్ నాయక్, వెంకటరెడ్డి అభినందించారు.

'శ్రీప్రకాష్'లో గురుపూజోత్సవం

తుని రూరల్, సెప్టెంబరు 4: శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల్లో గురుపూజోత్సవ వేడుకలను నిర్వహించారు. చర్చా వేదిక, ఆటల, నృత్య, నాటక, బృందగాన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి విజయప్రకాష్ మాట్లాడుతూ గురువులు అంకితభావంతో విద్యాబుద్ధులు నేర్పినప్పుడు మెరుగైన సమాజం చూడగలుగుతామన్నారు.

మోహన్‌కృష్ణకు సత్కారం

తాళ్లరేవు, సెప్టెంబరు 4: మండల ప్రజాపరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ చింతా మోహన్‌కృష్ణ కాకినాడ జిల్లా నీటియాజమాన్యసంస్థ పరిపాలనాధికారిగా బదిలీపై వెళ్తున్న సందర్భంగా ఎంపీపీ రాయుడు సునీత ఆధ్వర్యంలో బుధవారం కార్యాలయ సిబ్బంది ఘనంగా సత్కరించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, టీడీపీ నేతలు, పంచాయతీ సెక్రటరీలు తదితరులు ఉన్నారు.

ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చాలి

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల

తుని రూరల్, సెప్టెంబరు 4: యువ నాయకత్వం ప్రజలు ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. యనమలతో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ తేటగుంట క్యాంపు కార్యాలయంలో బుధవారం భేటీ అయ్యారు. జిల్లా అభివృద్ధి ప్రణాళికపై చర్చించారు. వరదలు, పునరావాసం తదితర అంశాలపై సమీక్షించారు. తునికి చెందిన మమతా హాస్పటల్ యాజమాన్యం, డాక్టర్ ఆర్.పుష్పారమావాణి రూ.2లక్షల ఆర్థిక సహాయాన్ని సీఎం సహాయనిధి కోసం యనమల, ఉదయ్ చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో యనమల రాజేష్, సుర్ల లోవరాజు, మోతుకూరి వెంకటేష్, చింతమనీడి నాగ సోమరాజు (అబ్బాయి), యనమల లక్ష్మణరావు, చోడిశెట్టి గణేష్, దండెం సురేష్ పాల్గొన్నారు.


సీఎం సహాయనిధికి విరాళమందజేస్తున్న దృశ్యం

పర్యావరణాన్ని పరిరక్షించాలి

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. వినాయకచవితి నేపథ్యంలో తొండంగి మండలం పెరుమళ్ళపురం సూర్యా విద్యాలయం విద్యార్థులు తయారు చేసిన మట్టి విగ్రహాలను యనమల చేతులమీదుగా పంపిణీ చేశారు. యనమల రాజేష్, కొయ్యా కేశవ్, కొయ్యా సూరిబాబు, యాదాల రామకృష్ణ పాల్గొన్నారు.

వరద బాధితులకు రైస్ బ్యాగ్‌ల పంపిణీ


విజయవాడలో బాధితులకు బియ్యం ప్యాకెట్లు అందిస్తున్న బుద్ధా వెంకన్న, కటకంశెట్టి

కాకినాడ సిటీ/కరప, సెప్టెంబరు 4: విజయవాడ భవానీపురంలో వరద బాధితులకు టీడీపీ కాకినాడ రూరల్ కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్(బాబీ) ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న పర్యవేక్షణలో 1500మందికి బుధవారం రైస్ బ్యాగ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేత నాయకుడు చిన్న సుబ్బయ్య, జిల్లా కార్యదర్శి కౌజు నెహ్రూ, కరప మండల మాజీ ఎంపీపీ గుళ్లిపల్లి శ్రీనివాసరావు, రూరల్ మండల మాజీ జడ్పీటీసీ కాకరపల్లి సత్యవతి చలపతిరావు, మాజీ జిల్లా తెలుగు మహిళాధ్యక్షురాలు ఏటుకూరి నాగమణి, జిల్లా మహిళా కార్యదర్శి కంచుమర్తి లావణ్య పాల్గొన్నారు. విజయవాడ వరద బాధితులను ఆదుకోవడానికి సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం కాకినాడలో సహాయ నిధి వసూలు చేశారు. కాకినాడ జీజీహెచ్ నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద సహాయ నిధి ఏర్పాటు చేసి విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో సీపీఎం నగర కమిటీ సభ్యుడు కె.సత్తిరాజు, జిల్లా నాయకురాలు జి.బేబిరాణి, నగర కన్వీనర్ పలివెల వీరబాబు, నగర కమిటీ సభ్యులు మలక వెంకటరమణ, సీహెచ్ వేణు, సూరిబాబు, చంద్రమళ్ల పద్మ, రమణమ్మ, జ్యోతి, పద్మావతి పాల్గొన్నారు.

అండగా ఉంటాం : వర్మ

పిఠాపురం, సెప్టెంబరు 4: విజయవాడలో వరద బాధితులకు ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. విజయవాడలోని 19వ డివిజన్‌లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆయన పర్యటించి బాధితులకు భోజన ప్యాకెట్లు, వాటర్‌బాటిల్స్ అందజేశారు. లబ్బీపేటలోని దర్శనం ఈ ఇస్లామి హైస్కూలులో ఏర్పాటు చేసిన పునరావస కేంద్రాన్ని పరిశీలించి విద్యార్థులు, ఇతర వరద బాధితులకు అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు, వారికి పాలు, బాటిల్స్ అందజేశారు. ఏలేరు రిజర్వాయర్ నుంచి అదనపు జలాలు విడుదల చేస్తున్నందున పిఠాపురం నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వర్మ సూచించారు. విజయవాడలో ఉన్న ఆయన బుధవారం మీడియాతో మాట్లాడుతూ రిజర్వాయర్‌లో నీటి మట్టం పెరుగుతున్న నేపథ్యంలో నీటిని విడుదల చేస్తున్నారని, రైతులు, ప్రజలు గమనించాలని ఆయన కోరారు. ప్రజలకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు అండగా నిలవాలని సూచించారు.

సూరంపేట వాసుల రాకపోకలకు బోటు

గొల్లప్రోలు, సెప్టెంబరు 4: సుద్దగడ్డ వరద జలదిగ్బంధంలో చిక్కుకున్న గొల్లప్రోలు శివారు సూరంపేట ప్రాంతానికి ప్రజలు రాకపోకలు సాగించేందుకు వీలుగా బుధవారం సాయంత్రం బోటు ఏర్పాటు చేశారు. సూరంపేట వద్ద పరిస్థితులు స్వయంగా చూసిన జిల్లా కలెక్టరు తక్షణం ఇక్కడ బోటు ఏర్పాటు చేయాని ఫిషరీస్ అధికారులను ఆదేశించారు. కలెక్టరు ఆదేశాలతో యుద్ధప్రాతిపదికన బోటు ఏర్పాటు చేయగా పాఠశాలలు, కళాశాలలకు వెళ్లిన విద్యార్థులు అందులో సూరంపేటకు తిరిగి వెళ్లారు.



బీజేపీ సభ్యత్వ నమోదు

కాకినాడ రూరల్, సెప్టెంబరు 4: దేశంలో ఎక్కువ మంది సభ్యత్వం కలిగిన పార్టీ బీజేపీ అని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట వైద్యనగర్ బీజేపీ కార్యాలయంలో కాకినాడ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, అతిథులుగా మాజీ జిల్లా అధ్యక్షుడు వై.మాలకొండయ్య, పార్లమెంట్ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు కవికొండల భీమశేఖర్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీ సభ్యత్వాలను అత్యధికంగా నమోదుచేసి పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. వైసీపీ అధ్యక్షుడు జగన్ కాంగ్రెస్ కూటమిలో చేరే ఆసక్తితో బెంగుళూరు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడన్నారు. సభ్యత్వ కార్యక్రమ జిల్లా ఇన్‌చార్జి అసపర్తి వెంకటేష్, గంగరాజు, కొండలరావు, బిక్కిన విశ్వేశ్వరరావు, శ్రీనివాసరాజు ఉన్నారు.


నమోదు పత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

నేడు పిఠాపురంలో కోర్టుల సముదాయం ప్రారంభం


నూతనంగా నిర్మించిన కోర్టుల సముదాయం

పిఠాపురం, సెప్టెంబరు 4: పిఠాపురంలో నూతనంగా నిర్మించిన కోర్టుల సముదాయాన్ని గురువారం సాయంత్రం ప్రారంభించనున్నారు. సుమారు రూ.6కోట్లు వ్యయంతో నిర్మించిన పిఠాపురం 12వ అదనపు జిల్లా జడ్జి, సీనియర్ సివిల్ జడ్జిల కోర్టులను వర్చువల్ విధానంలో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రారంభిస్తారని పిఠాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రాజారావు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు జడ్జిలు రవినాథ్ తిల్హరి, ఆర్.రఘునందనరావు, బీవీచక్రవర్తి, టి.మల్లిఖార్జునరావు, జె.సుమతి, న్యాయపతి విజయ్ పాల్గొంటారని వివరించారు.

రోడ్డు నిర్మాణానికి రూ.30 లక్షలు


రోడ్డు దుస్థితిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, సెప్టెంబరు 4: పట్టణ శివారు లారీ స్టాండ్ ఎదురుగా ఉన్న నూతనంగా రోడ్డు నిర్మించేందుకు రూ.30 లక్షల నిధులు మంజూరైనట్టు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప వెల్లడించారు. బుధవారం సామర్లకోట లారీ స్టాండ్ రోడ్డు దుస్థితిపై టీడీపీ నాయకులు విజ్ఞప్తుల మేరకు ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రజలకు ఏ అసౌకర్యం లేకుండా త్వరితగతిన రోడ్డు పనులు చేట్టేలా అధికారులను ఆదేశించామని స్పష్టంచేశారు. సామర్లకోటలో భారీ వర్షాల కారణంగా ఎస్‌బీఐ వెనుక కరపచెరువు సమీపాన బుధవారం తాటాకిల్లు గోడ నాని కూలిపోయింది. స్థానిక టీడీపీ నాయకులు సంఘటనా స్థలికి చేరుకుని బాధితులకు సేవలందించారు. ఎమ్మెల్యే చినరాజప్ప దృష్టికి తీసుకెళ్లడం ద్వారా ప్రభుత్వ సాయం అందించేలా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ పేలుడు

గొల్లప్రోలు, సెప్టెంబరు 4: గొల్లప్రోలు విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్ బుధవారం ఉదయం పేలిపోయింది. ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పేలడంతో పట్టణంతో పాటు పరిసర గ్రామలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ శాఖాధికారులు అక్కడకు చేరుకుని మరమ్మతులు నిర్వహించారు. ఉదయం 10గంటలకు సరఫరాను పునరుద్ధరించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

ఏలేశ్వరం, సెప్టెంబరు 4: టీడీపీ పట్టణాధ్యక్షుడు, 14వ వార్డు కౌన్సిలర్ మూది నారాయణస్వామి జన్మదినం పురస్కరించుకొని సుమారు 60 మంది పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. స్థానిక భవిత కేంద్రంలో దివ్యాంగులకు అన్నదానం చేశారు. కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, పెంద్ర శ్రీను, సామంతుల గోపి, కోరాడ కృష్ణ మోహన్, బుగతా శ్రీనివాస్, వాగు రాజేష్, రాంబాబు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

జీజీహెచ్ (కాకినాడ), సెప్టెంబరు 4: కాకినాడ రామారావుపేట నారాయణ ఈ-టెక్నో అండ్ ఒలింపియాడ్ స్కూల్‌లో బుధవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. లయన్స్ క్లబ్ పాస్ట్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ విజయరామరాజు జన్మదినం సందర్భంగా ట్రస్ట్ హాస్పటల్ వైద్యులు నిర్వహించిన శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ వైద్య పరీక్షలు నిర్వహించి విద్యార్థులు, అధ్యాపకులకు మందులను ఉచితంగా అందజేశారు. 316 బి గవర్నర్ వీవీ ఈశ్వరకుమార్, డీసీఎస్ ఆదినారాయణ, ఆర్‌సీ పద్మతులసి, జెడ్‌సీ నమశివాయ, ప్రిన్సిపాల్ షర్మిలా, సెక్రటరీ నాగేశ్వరి, ట్రెజరర్ నాగమణి పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

గండేపల్లి, సెప్టెంబరు 4: మండలంలోని మల్లేపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం రాజమహేంద్రవరం గౌతమి నేత్రాలయం వారిచే ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సర్పంచ్ బలిరెడ్డి వరలక్ష్మిగంగరాజు ఆధ్వర్యంలో సీనియర్ వైద్యాధికారిణి సత్య ప్రారంభించారు.

ముంపు సమస్యకు పరిష్కారం

కరప, సెప్టెంబరు 4: బుధవారం కురిసిన భారీ వర్షానికి గొర్రిపూడి ఎస్సీపేట, ఇందిరా కాలనీ ముంపునకు గురయ్యాయి. జనావాసాల్లోకి ముంపు నీరు చేరడంతో స్థానిక జనసైనికులు ఎమ్మెల్యే పంతం నానాజీ దృష్టికి తీసుకెళ్లారు. జనసేనపార్టీ మండలాధ్యక్షుడు బండారు మురళి ప్రొక్లెయినర్‌తో ముంపునీరు బయటకు పోయేలా కచ్చా డ్రెయిన్ తవ్వించారు. దీంతో ముంపు సమస్యకు తాత్కాలిక పరిష్కారం దొరికింది.